**కథ**

**"అమ్మా వాణీ! నా మాట విని అజయ్ విషయం మరచిపో. నేను నీకు మంచి సంబంధం చూసి పెళ్ళి చేస్తాను" పార్థసారధి కూతురు శ్రీవాణితో అన్నాడు.**

**"సారీ నాన్నా. ఆడది తనను ప్రేమించే వాడితోనే సుఖపడుతుంది. నేను అజయ్‌ని మరచిపోలేను" స్థిరంగా అంది శ్రీవాణి.**

''కానీ అతని ప్రేమలో నిజాయితీ ఉన్నప్పుడే నీవన్నది నిజమౌతుంది. అసలు నువ్వు అతని గురించి పూర్తిగా తెలుసుకొన్నావా? అతని ప్రవర్తన గురించి విచారించావా? అతని తల్లిదండ్రులు అతనివల్ల సంతోషంగా ఉన్నారా? అతనికి చెడు అలవాట్లు ఏవైనా ఉన్నాయా? ఇవన్నీ తెలుసుకోకుండా నిన్ను ప్రేమిస్తున్నాడని పొంగిపోయి పెళ్ళి చేసుకోవడం అవివేకం''

''నాన్నా.. నేనూ చదువుకొన్నాను. నాకు

# తండ్రి మనసు

ఆమాత్రం తెలియదా? అజయ్‌కు చెడు అలవాట్లు లేవు. అతనికి తల్లిదండ్రుల్లేరు. మేనమామ దగ్గరే పెరిగాడు. వాళ్ళు అతనివల్ల సంతోషంగానే ఉన్నారు''

''అతని ఉద్యోగం చిన్నదంటున్నావు. నువ్వు ఏ లోటూ తెలియకుండా పెరిగినదానవు. ఆ సంపాదనకు అడ్జస్ట్ కాగలవా?''

''ఆయన కోసం ఎటువంటి కష్టాలనైనా ఎదుర్కోవడానికి నేను సిద్ధమే నాన్నా''

''నువ్వు పదే పదే సినిమా డైలాగులు చెబుతున్నావు తప్ప నా బాధ అర్థం చేసుకోవడం లేదు. ఎవరో ముక్కూ మొఖం తెలియనివాడికి నీకిచ్చి పెళ్ళి చేసి మనశ్శాంతిగా ఉండలేను. నిన్ను కళ్ళల్లో పెట్టుకొని పెంచిన మా కోసమైనా నువ్వు మనసు మార్చుకోలేవా?''

''మీరు అజయ్ గురించి అన్నీ కనుక్కొనే మా పెళ్ళి చేయండి. నాకోసం ఎంతో చేసిన మీరు ఈ ఒక్కటి కూడా చెయ్యండి. మమ్మల్ని ఆశీర్వదించండి''

''నీ కంటె ముందు పుట్టిన శ్రీలేఖ పెళ్ళి చెయ్యాలి. ఆమెకు సంబంధం కుదిరేవరకూ ఆగు''

''సారీ నాన్నా. వీలైనంత తొందరలో మా పెళ్ళి జరుగుతుంది. మీరొప్పుకుంటే వైభవంగా, లేకుంటే గుళ్ళో సింపుల్‌గా'' అంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది శ్రీవాణి.

ఏం చేయాలో తోచనట్లు నిలబడిపోయాడు పార్థసారధి.

★ ★ ★

శ్రీవాణి పెళ్ళి గుళ్ళో జరిగింది. అజయ్ ఫ్రెండ్స్, అతని మేనమామ ఫ్యామిలీ పెళ్ళికి హాజరయ్యారు. ఆ ఊళ్లోనే ఓ యిల్లు అద్దెకు తీసుకొని కొత్త సంసారం ప్రారంభించారు నూతన దంపతులు.

ఆరు నెలల తరువాత శ్రీవాణి అక్క శ్రీలేఖకు పెళ్ళి కుదిరింది. ఆ వార్త విని శ్రీవాణి ఎంతో సంతోషించింది. పెళ్ళికి పిలవడానికి తల్లి గిరిజ శ్రీవాణి ఇంటికొచ్చింది. తల్లిని చూడగానే ఆనందంతో కౌగలించుకొంది శ్రీవాణి.

తర్వాత ''నాన్నకు చెప్పే వచ్చావా అమ్మా'' అని అనుమానంగా అడిగింది.

''మీ నాన్నే నన్ను పంపారమ్మా. శ్రీలేఖకు పెళ్ళి కుదిరిందన్న విషయం నీకు తెలుసు కదా. నిన్ను, అల్లుడిగారిని పెళ్ళికి పిలిచి రమ్మన్నారు నన్ను. అల్లుడుగారు లేరా?''

''ఇంకా ఆఫీసు నుంచి రాలేదు'' అంటూ వంట గదిలోకెళ్ళి కాఫీ తయారుచేయసాగింది శ్రీవాణి. గిరిజ కూడా ఆమె వెనకే వెళ్ళి కొంతసేపు మాట్లాడుతూ ఉండిపోయింది.

కాఫీ త్రాగాక శుభలేఖ యిచ్చి- ''పెళ్ళికి తప్పక రమ్మని, అజయ్‌కు కూడా చెప్పి పిలుచుకురమ్మని, వీలైతే అజయ్ ఉన్నప్పుడు వచ్చి స్వయంగా పిలుస్తానని'' శ్రీవాణితో చెప్పి వెళ్ళిపోయింది గిరిజ.

పెళ్ళికి వెళ్ళిన శ్రీవాణిని బంధువులందరూ ఆప్యాయంగా పలుకరించారు. పార్థసారధి మాత్రం బిజీగా ఉండటంతో శ్రీవాణిని చూడలేదు. అది ఆమెను చాలా బాధపెట్టింది. ఆమెకు అక్కడ ఉండాలనిపించక వడివడిగా గేటు వైపు నడవసాగింది. 'తన తండ్రికి యింకా తనపై కోపం పోలేదు' అనుకొంటూ నడుస్తున్న ఆమెకు వెనుక నుంచి 'అమ్మా' అన్న పిలుపు వినిపించి వెనక్కు తిరిగి చూసింది. ఎదురుగా పార్థసారధి నిలబడి ఉన్నాడు.

''భోజనం చేసి తాంబూలం తీసుకుని వెళ్లమ్మా. అల్లుడుగారు రాలేదా'' ఆప్యాయంగా అడిగాడు పార్థసారథి.

''లేదు నాన్నా. తప్పనిసరిగా క్యాంపుకు వెళ్లవలసి వచ్చింది. మధ్యాహ్నానికి వచ్చేస్తానన్నారు''

తండ్రి తనతో మాట్లాడడం ఆమెకు ఎంతో సంతోషాన్ని కలగజేసింది. శ్రీలేఖ అత్తగారింటికి వెళ్లేంతవరకూ తల్లితోనే ఉండి ఆమెకు అన్ని పనుల్లో సహాయం చేసింది. అజయ్ కూడా పార్థసారధికి తోడుగా ఉండి అతని పనులు పంచుకున్నాడు.

ఇంటికి వచ్చాక తల్లిదండ్రులిచ్చిన తాంబూలం ప్యాకెట్ విప్పింది శ్రీవాణి. తనకు, భర్తకు పెట్టిన బట్టలతోపాటు ఓ కవరు కూడా కనిపించింది. కవర్లో ఉత్తరం, ఓ చెక్కు కనిపించింది. తండ్రి తనకు రాసిన ఉత్తరమది. తీసి చదవసాగింది.

''నీ అక్క పెళ్లికి రెండు లక్షలు ఖర్చు పెట్టాను. రెండు లక్షలు ఖర్చుపెట్టి నీకు పెళ్లి చేసే అవకాశం నువ్వు నాకివ్వలేదు. అయితే నా ఇద్దరు కూతుర్లనూ నేను ఎప్పుడూ సమానంగానే చూసుకున్నాను. అందుకే ఈ రెండు లక్షల చెక్కు నీకిస్తున్నాను''


చెక్కును, ఉత్తరాన్ని భర్తకు చూపించింది. కొంత సొమ్ముతో ఇంటికి కావలసిన ముఖ్యమైన వస్తువులు కొని, మిగిలిన సొమ్మును బ్యాంకులో దాచుకోవాలని నిర్ణయించుకున్నారు వాళ్లిద్దరూ.

★ ★ ★

శ్రీవాణి ఇంటికి వచ్చిన గిరిజ తన చేతిలోని న్యూస్ పేపరును కూతురికిస్తూ ''ఇందులో మీ నాన్నగారి గురించి రాశారు. చదువు'' అంది ఆనందంగా.

శ్రీవాణి పేపరు అందుకుని చదివింది- 'శతాధిక కథారచయిత పార్థసారథి' అన్న హెడ్డింగుతో ఆయన గురించి, ఆయన కథల గురించి రాశారు.

పేపరు చదివి తల్లికిస్తూ ''ఆయన ఎంత బాగా రాసినా ఆచరణలోకి వచ్చేసరికి మామూలు మనిషిగానే ప్రవర్తించాడు. అక్కది కూడా నాలాగే ప్రేమ వివాహమే. అయితే ఆయన ఎంతో వైభవంగా పెళ్లి చేశారు. నా పెళ్లి చూడడానికి కూడా రాలేదు. కారణం బావ మన బంధువులబ్బాయి. ఒకే కులం వాడు. ఈయన కులం వేరు కనుక ఈయన్ను అల్లుడిగా చేసుకోవడానికి మనసు



రాలేదు. 'నీతులు ఎదుటి మనిషికి చెప్పడానికే' అని ఆయన రుజువు చేశారు'' అంది ఈసడింపుగా.

''ఆయన పట్టింపు కులం గురించి కాదమ్మా. మీ ఆయన జీతం గురించి. కట్టుకున్న భార్యకు ఓ పట్టుచీర కూడా కొనివ్వలేని అసమర్థుడని'' అంది గిరిజ.

''అమ్మా! ఆయన గురించి ఏమైనా అన్నావంటే బాగుండదు. నన్నేమైనా అను పర్వాలేదు. అయినా ఆయన నుంచి నేను కోరేది పట్టుచీరలు కాదు. ప్రేమ, అనురాగం''. అంది శ్రీవాణి కోపంగా.

''ఆరు నెలల అనుబంధానికే నీ భర్తనంటే అంత కోపం వచ్చిందే. మరి మీ నాన్నతో పాతికేళ్ల అనుబంధం ఉన్న నాకు ఆయన్నంటే ఎంత కోపం రావాలి'' అంది గిరిజ నవ్వుతూ. తనకు బుద్ధి చెప్పడానికే తన తల్లి తన భర్త గురించి అలా మాట్లాడిందని అర్థమైంది శ్రీవాణికి.

''సారీ అమ్మా! నిన్ను నొప్పించాను. నన్ను క్షమించు'' అంది పశ్చాత్తాపంగా.

''నువ్వు ఈరోజు ఆ మాటన్నావు గనక అసలు విషయం చెబుతాను విను. అజయ్‌ను మరచిపొమ్మని మీ నాన్నగారు నీకు ఎంతగానో నచ్చచెప్పినా నువ్వు వినలేదు. ఇక నీ నిర్ణయం మారదని తెలుసుకుని అజయ్ గురించి విచారించారు. అతని జీతం గురించి తప్ప ఇంకే విషయంలోనూ అతన్ని కాదనడానికి కారణం కనిపించలేదు మీ నాన్నగారికి. అయితే మీ పెళ్లికి పెట్టే ఖర్చు మీకే ఇచ్చేస్తే మీ సంసారానికి, అవసరాలకి ఎంతో ఉపయోగపడుతుందని ఆయన యోచించారు. కానీ మీ పెళ్లికి ఒప్పుకున్నాక, నీ పెళ్లి గుడిలో సింపుల్‌గా చేస్తానంటే నువ్వు ఒప్పుకునేదానివా? అందుకే మీ పెళ్లి ఇష్టం లేనట్టు నటించి మీ పెళ్లి మీరే చేసుకునేలా చేశారు. పైగా మీ పెళ్లి సింపుల్‌గా చేస్తే మన బంధువులు ఆయన్ని ఓ పిసినారిగా చిత్రించి ప్రచారం చేసే అవకాశం కూడా ఉంది. శ్రీలేఖ పెళ్లి కాగానే ఆమె పెళ్లికి ఎంత ఖర్చయిందో అంత మొత్తాన్ని మీకందించారు. శ్రీలేఖ పెళ్లి ఘనంగా చెయ్యడానికి కారణం వాళ్లిద్దరూ మంచి ఉద్యోగాల్లో ఉన్నారు కాబట్టే. తల్లిదండ్రులు ఏదైనా అన్నా అది పిల్లల మంచి కోసమే. ఏది చేసినా అది వాళ్ల భవిష్యత్తు కోసమే''

''మరి ఇన్నాళ్లూ మా ఇంటికి ఎందుకు రాలేదు ఆయన?'' శ్రీవాణి ప్రశ్నించింది.

''మీ మీద ఉన్న కోపం వల్ల. అది నువ్వు అజయ్‌ను పెళ్లి చేసుకున్నందుకు కాదు కనీసం శ్రీలేఖ పెళ్లి వరకూ మీరు ఆగలేకపోయినందుకు. అయితే ఆ కోపం కొద్ది రోజులే ఉండింది. నువ్వు వచ్చి ఆయన్ను పిలిచి ఉంటే తప్పకుండా నీ ఇంటికి వచ్చి ఉండేవారు''

''అయితే ఇప్పుడు రానా నీతో. ఆయన్ను క్షమించమని కూడా అడగాలి అపార్థం చేసుకున్నందుకు''

''పెళ్లయ్యాక మొదటిసారి పుట్టింటికి వస్తున్నావు కాబట్టి మీ ఆయన వచ్చాక ఇద్దరూ కలిసి రండి. మా ఆయన మిమ్మల్ని రిసీవ్ చేసుకుంటారు'' అంది గిరిజ నవ్వుతూ.

''థాంక్యూ అమ్మా, థాంక్యూ'' అంటూ తల్లి చేతిని పట్టుకుని ఊపేసింది శ్రీవాణి ఆనందంతో.

**సి.ఎన్.చంద్రశేఖర్**